క్లుప్తంగా

కర్నూలుకు వెళ్లి పింఛన్ పంపిణీ



రమాదేవికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ రేణుక

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామానికి చెందిన రమాదేవి అనే వృద్ధురాలు అనారోగ్యంతో కర్నూలులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వలంటీర్ రేణుక బుధవారం కర్నూలుకు వెళ్లి పింఛన్ అందజేసి ప్రశంసలు పొందారు. ప్రభుత్వం వృద్ధులను ఆదుకునేలా వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే పింఛన్ అందిస్తోందని, ఇప్పుడు అనారోగ్యంతో ఆస్పత్రిలో వైద్యం పొందుతుండడంతో ఇక్కడికే వచ్చి పింఛన్ సొమ్ము అందించడం సంతోషంగా ఉందని కుటుంబసభ్యులు తెలిపినట్లు వలంటీర్ రేణుక చెప్పారు.



ఎరుకుల రాఘవేంద్రకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ ఉప్పర రవికుమార్

దేవనకొండ: మండలంలోని కుంకనూరుకు చెందిన పింఛన్‌దారుడు ఎరుకుల రాఘవేంద్ర అనారోగ్యంతో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ ఉప్పర రవికుమార్ బుధవారం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి రూ.3 వేలు పింఛన్‌ను అందించాడు. దీంతో పింఛన్‌దారుడు, వారి కుటుంబ సభ్యులు వలంటీర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



పింఛన్లను పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు

ఎమ్మిగనూరుటౌన్: పింఛన్ల పెంపుతో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు మేలు చేకూరిందని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని వార్డు సచివాలయంలో లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇచ్చిన హామీ మేరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్లను పెంచారన్నారు. వార్డు ఇన్‌చార్జ్ బాబుఖాన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటిని వృథా చేయొద్దు

ఆలూరు: ఎస్ఎస్ ట్యాంకుల నుంచి ఫిల్టర్ బెడ్ల ద్వారా శుద్ధిచేసిన నీరు గ్రామాలకు సరఫరా అయ్యేలా ఏఈలు పర్యవేక్షించాలని ఆలూరు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మల్లికార్జునయ్య ఆదేశించారు. హాలహర్వి మండలం బాపురం, చింతకుంట గ్రామాల్లోని ఎస్ఎస్ ట్యాంకులలో నీటి నిల్వ సామర్థ్యాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. అనంతరం స్థానిక కార్యాలయంలో డీఈ మాట్లాడుతూ.. ఎల్లెల్సీ కాలువ ద్వారా రిజర్వాయర్లలో తాగునీటిని 3 నుంచి 4 నెలలకు సరిపడేలా పంపింగ్ చేసుకోవడం జరిగిందన్నారు. నీటిని సరఫరా చేసే మోటార్లు రిపేరు కాకుండా చూసుకోవాలన్నారు. ఏఈలు, సిబ్బంది, రిజర్వాయర్ల గేజ్‌ల రిపోర్టులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

నందవరంలో నారా భువనేశ్వరి పర్యటన

నందవరం: నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా టీడీపీ నేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి నందవరం మండలంలో పర్యటించారు. చంద్రబాబు అరెస్టుతో మృత్యువాత పడిన వ్యక్తుల కుటుంబసభ్యులను పరామర్శించారు. బుధవారం మండల పరిధిలోని మాచాపురం గ్రామం చేరుకుని కొండ హనుమంతు ఇంటికి వెళ్లారు. ఆ కుటుంబసభ్యులను పరామర్శించి రూ.3 లక్షల చెక్కును భార్య శంకరమ్మకు అందజేశారు. అనంతరం రోడ్డు మార్గంలో నందవరం మీదుగా ముగతి గ్రామానికి చేరుకుని మాదిగ నాగరాజు కుటుంబ సభ్యులను కలుసుకున్నారు. ఆయన భార్య లలితమ్మకు రూ.3 లక్షల చెక్కును అందించారు. అక్కడి నుంచి ఎమ్మిగనూరుకి వెళ్లారు. ఎమ్మెల్సీ అనురాధ, మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, బీటీ నాయుడు, మండల నాయకులు ఉన్నారు.

బైక్ ఢీకొని జింక మృతి



మృతి చెందిన జింక

పత్తికొండ రూరల్: పత్తికొండ–కోతిరాళ్ల ప్రధాన రోడ్డుపై బుధవారం వేగంగా వెళ్తున్న బైక్‌కు జింక అడ్డు అడ్డురావడంతో ఢీకొట్టగా జింక మృతిచెందింది. వివరాలు.. గోనెగండ్ల మండలం బండగట్టు గ్రామానికి చెందిన వెంకటేష్ పని నిమిత్తం పత్తికొండకు వస్తున్నాడు. కోతిరాళ్ల–కనకదిన్నె గ్రామాల మధ్యలో వెళుతుండగా జింక పరిగెత్తుతూ ఒక్కసారిగా బైక్‌కు అడ్డుగా వచ్చింది. బలంగా ఢీకొట్టడంతో జింక మృతి చెందింది. బైక్ అదుపుతప్పి కిందపడగా యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాణాపాయం ఏమీ లేదని వైద్యులు తెలిపారు.



ఆస్పరిలో కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ మూలింటి రాధమ్మ



మదార్‌పురంలో క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీడీఓ, జెడ్పీటీసీ, ఎంఈఓలు



గెలుపొందిన క్రీడాకారులతో అధికారులు, పీఈటీలు



మద్దికెర: కబడ్డీలో తలపడుతున్న జట్లు



నందవరం: ఖోఖోలో తలపడుతున్న క్రీడాకారులు

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే

‘ఆడుదాం - ఆంధ్ర’

- ఉత్సాహంగా మండలస్థాయి క్రీడాపోటీలు
- సందడి చేసిన ప్రజాప్రతినిధులు
- సత్తా చాటిన క్రీడాకారులు

ఎమ్మిగనూరుటౌన్: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ‘ఆడుదాం – ఆంధ్ర’ పోటీలు నిర్వహిస్తోందని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థినుల కబడ్డీ పోటీలను ప్రారంభించారు. అంతకుముందు ఏర్పాటు చేసిన క్రీడల ప్రారంభోత్సవ సభలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మాచాని వెంకటేష్, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డితో కలిసి క్రీడాకారులకు క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడాకారుల్లో దాగిఉన్న నైపుణ్యాన్ని చాటుకునేందుకు ఈ పోటీలు ఉపయోగపడుతాయన్నారు. క్రీడలతో ఆరోగ్యం, దేహదారుఢ్యంతో పాటు క్రీడాకారుల మధ్య స్నేహభావం అలవడుతుందన్నారు. ఎంపీపీ కేశన్న, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బుట్టారంగయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, ఎంఈఓ ఆంజనేయులు, ఎంపీడీఓ బంగారమ్మ, కౌన్సిలర్లు శివప్రసాద్, వాహిద్, కేశవరెడ్డి, సూరి, అంపమ్మ, సుధాకర్ పాల్గొన్నారు.

హాలహర్వి: మండలస్థాయిలో కబడ్డీ మొదటి సెమీఫైనల్‌లో నిట్రవట్టి జట్టుపై విరుపాపురం జట్టు గెలుపొందిందని మండల ప్రత్యేకాధికారి రామాంజనేయులు, ఎంపీడీఓ ఆంతోనీ తెలిపారు. మరో సెమీఫైనల్లో చింతకుంట జట్టుపై అర్ధగేరి జట్టు విజయం సాధించింది. తర్వాత అర్ధగేరి, విరుపాపురం జట్ల మధ్య జరిగిన ఫైనల్ పోటీల్లో అర్ధగేరి జట్టు విజయం సాధించి నియోజకవర్గస్థాయిలో పోటీలకు ఎంపికైంది. గెలుపొందిన జట్లను వారు అభినందించారు. పంచాయతీ కార్యదర్శి ఈరన్న, పీఈటీలు వీరేష్, హరికృష్ణ, తేజ, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



గోనెగండ్లలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

తుగ్గలి: యువతలోని క్రీడా ప్రతిభను వెలికితీసి, ప్రోత్సహించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం – ఆంధ్ర క్రీడాపోటీలను నిర్వహిస్తోందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. బుధవారం తుగ్గలిలో మండల స్థాయి ఖోఖో, కబడ్డీ పోటీలను ఆమె ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నేటి విద్యార్థులు కేవలం మొబైల్స్, కంప్యూటర్‌లకే అలవాటు పడడంతో తగిన వ్యాయామం ఉండటం లేదన్నారు. వారి శారీరక సామర్థ్యాన్ని పెంపొందించేందుకే ఇలాంటి క్రీడాపోటీలు దోహదపడతాయన్నారు. మెరికల్లాంటి క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. సర్పంచ్ రవి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేష్, మోహన్‌రెడ్డి, హనుమంతు, నాగభూషణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మద్దికెర: యువత క్రీడాపోటీల్లో పాల్గొని ఉన్నతంగా రాణించాలని జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, ఎంపీపీ అనిత సూచించారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో క్రీడాపోటీలు నిర్వహించారు. ఎంపీడీఓ నరసింహమూర్తి, సర్పంచు సుహాసిని, పంచాయతీ సలహాదారు ఆంజనేయులు, ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, తదితరులు పాల్గొన్నారు. మండలస్థాయి కబడ్డీ పోటీల్లో పెరవలి టీం విజేతగా నిలిచి తాలుకా స్థాయికి ఎంపికైనట్లు ఈఓ సుధాకర్ తెలిపారు.

మండలంలోని 9 సచివాలయాల జట్లు పాల్గొనగా హంప సచివాలయ పరిధిలోని ఎడవలి జట్టుపై పెరవలి జట్టు తలపడి 12 పాయింట్లు తేడాతో విజయం సాధించిందన్నారు. విజయం సాధించిన జట్టును అధికారులు, నాయకులు అభినందించారు.

ఆస్పరి: ‘ఆడుదాం ఆంధ్ర’లో భాగంగా బుధవారం ఆస్పరి జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో మండల స్థాయి కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీలను సర్పంచ్ మూలింటి రాధమ్మ ప్రారంభించారు. వివిధ గ్రామాల క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మండలంలోని ములుగుందం, యాటకల్లు జట్ల మధ్య కబడ్డీ పోటీలు నిర్వహించారు. కేడీసీసీ బ్యాంకు జిల్లా డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకుడు సుంకర రామాంజినేయులు, ఎంపీడీఓ రాణెమ్మ, ఏంఈఓ రాజేంద్రప్రసాద్, పీడీ, పీఈటీలు పాల్గొన్నారు.





ఎమ్మిగనూరులో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, తుగ్గలిలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

హొళగుంద: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో బుధవారం ఆడుదాం – ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా కబడ్డీ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఎంపీడీఓ సుభాషిణి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు రాజశేఖర్, షఫి, రంగస్వామి తదితరులతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు ఈశా, పంపాపతి, హనుమప్ప, మల్లయ్య తదితరులు టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. కొద్దిసేపు కబడ్డీ ఆడి క్రీడాకారులను ఉత్సహ పరిచారు.

నందవరం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడాపోటీలను హెచ్ఎం శివరామ్, ఫిజికల్ డైరెక్టర్లు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో మానసికోల్లాసం, దేహదారుఢ్యం వృద్ధి చెందుతుందన్నారు. క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్ గెలుపొందిన క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలుంటాయని వెల్లడించారు. ఫిజికల్ డైరక్టర్లు మహమ్మద్ హనీఫ్, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: క్రీడల్లో రాణించే వారికి మంచి భవిష్యత్ ఉంటుందని ఎంపీడీపీ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని గోనెగండ్ల, వేముగోడు, పెద్దనేలటూర్ గ్రామ పంచాయతీల్లో మండల స్థాయి క్రీడాపోటీలను అధికారులు ప్రారంభించారు. ఈఓ సతీష్, పంచాయతీ కార్యదర్శులు వెంకటేష్, సోమేష్, నరసమ్మ, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): మండలంలోని 18 సచివాలయాల నుంచి క్రికెట్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ విభాగాలలో ఒక్కో టీమ్ మండల స్థాయికి ఎన్నిక కాగా ఆయా జట్లకు పోటీలను వెల్దుర్తి, మదార్‌పురం గ్రామాలలో ప్రారంభించారు. వెల్దుర్తి బాలుర హైస్కూల్‌లో కబడ్డీ పోటీలు, మదార్‌పురంలో క్రికెట్ పోటీలను ఎంపీడీఓ శ్రీనివాసరావ్, ఎంఈఓ–2 రమేష్, జెడ్పీటీసీ సుంకన్న ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకట్ నాయుడు, నాయకంటి రాజు, ఏసు పాల్గొన్నారు.



కృష్ణగిరిలో క్రికెట్‌లో తలపడుతున్న క్రీడాకారులు

కృష్ణగిరి: గ్రామీణ క్రీడాకారులు సత్తా చాటాలని ఎంపీడీఓ రామస్వామి పిలుపునిచ్చారు. కృష్ణగిరిలోని జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో మండలస్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలను ఎంఈఓ–2 మద్దయ్యతో కలిసి ప్రారంభించారు. పీఈటీలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాల మైదానంలో మండల స్థాయి ఆడుదాం– ఆంధ్రా పోటీలను ఎంపీడీఓ అల్లబకష్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 17 సచివాలయాల పరిధిలో ప్రతిభ చాటి మండల స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరిచి నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. బుధవారం క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. పీడీలు నాగేషులు, కవిరాజు పీఈటీలు రామస్వామి, చినబాబు, సరోజ, నాగ నరసింహరాజు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

మాచాని వెంకటేష్‌కు సంపూర్ణ మద్దతు



మాట్లాడుతున్న కురవ సంఘం పెద్దలు

ఎమ్మిగనూరురూరల్: బీసీ నేత వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మాచాని వెంకటేష్‌కు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని కురవ సంఘం తాలుకా అధ్యక్షుడు ఎర్రకోట అంపయ్య, ఆ సంఘం పెద్దలు పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల అధ్యక్షుల కార్యాలయంలో వారు ఏర్పాటు మాట్లాడుతూ.. బీసీ సామాజిక వర్గం చేనేత కుటుంబానికి చెందిన మాచాని వెంకటేష్‌ను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించడాన్ని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డితో పాటు తామంతా స్వాగతిస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు తగిన ప్రాధాన్యత ఇస్తున్నారని గుర్తుచేశారు. రాబోవు ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయానికి శాయశక్తులా కృషి చేస్తామన్నారు. కురవ సంఘం సభ్యులు యంకప్ప, మల్లికార్జున, వెంకటేషులు, అయ్యన్న, అంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

మోదీ ప్రభుత్వంపై ప్రజల విశ్వాసం



గజ్జహళ్లిలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి సత్యపాల్ సింగ్ బఘేల్

హొళగుంద: దేశాభివృద్ధి కోసం ప్రధాని నరేంద్రమోదీ ఎనలేని కృషి చేస్తున్నారని, కేంద్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి సత్యపాల్ సింగ్ బఘేల్ అన్నారు. బుధవారం హొళగుంద మండలం గజ్జహళ్లి గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయనకు గ్రామస్తులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్థానిక పోతులింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వైద్య, వ్యవసాయం, హౌసింగ్ తదితర శాఖలకు సంబంధించిన స్టాల్స్‌ను ఆయన పరిశీలించారు. ఆయా శాఖల పథకాలు, అమలు తీరు ఇతర విషయాల గురించి వారు మంత్రికి వివరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఇక్కడి సినీ హీరోలు చిరంజీవి, జూనియర్ ఎన్టీఆర్ తనకు మంచి మిత్రులని, సినిమాల్లో నటించిన అనుభవం ఉందని, ఇక్కడి నటులతో పరిచయాలున్నట్లు చెప్పారు. మోదీ ప్రభుత్వంపై ప్రజలకు విశ్వాసం ఉందని గరీబ్‌కల్యాణ్, ఆయుష్మాన్ భారత్, పీఎం కిసాన్, సురక్ష బీమా యోజన, ఉచిత గ్యాస్ సిలిండర్ తదితర కేంద్ర పథకాలు పేదలకు మేలు చేస్తున్నాయని చెప్పారు. రైతులు, పేద ప్రజల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు అమలుచేస్తున్నామన్నారు. సర్పంచ్ ఆరుబట్ల నాగమ్మ, ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణశర్మ, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, ఆయా శాఖల జిల్లా ఉన్నతాధికారులు, డీపీఓ నాగరాజునాయుడు తదితరులతో పాటు బీజేపీ జిల్లా నాయకులు నీలకంఠ, చిదానంద, ప్రసాద్, రామలింగతో పాటు గ్రామపెద్దలు గిరిమల్ల పాల్గొన్నారు.

ఎస్సీ రిజర్వేషన్ కల్పించాలి

మాదాసి, మాదారి కురువలకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేలా కృషి చేయాలని హొళగుంద మండల కురువ సంఘం నాయకులు శేషప్ప, ఎస్కే గిరి, మల్లయ్య, సుధాకర్, బొజ్జన్న తదితరులు బుధవారం కేంద్ర మంత్రి సత్యపాల్ సింగ్ బఘేల్‌కు వినతి పత్రం ఇచ్చారు.

ప్రశాంతతకు భంగం కలిగిస్తే చర్యలు



గ్రామస్తులకు కౌన్సెలింగ్ ఇస్తున్న రూరల్ సీఐ

ఎమ్మిగనూరురూరల్: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని రూరల్ సీఐ మోహన్‌రెడ్డి హెచ్చరించారు. ఆయన బుధవారం రాత్రి మండల పరిధిలోని ఫ్యాక్షన్ గ్రామం కోటేకల్‌లో పల్లెనిద్ర చేపట్టారు. గ్రామస్తులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఫ్యాక్షన్ గొడవలకు వెళ్లి కుటుంబాలు నాశనం చేసుకోవద్దని హితవుపలికారు. ప్రశాంత జీవనం సాగించాలని, పిల్లలను బాగా చదివించుకోవాలని సూచించారు. రాత్రి గ్రామంలోనే నిద్రించారు. రూరల్ ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో జేబుదొంగలు

ఎమ్మిగనూరురూరల్: స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన ఈరన్న కర్నూలు వెళ్లేందుకు బస్సు ఎక్కుతుండగా ప్యాంట్ వెనక జేబులో పెట్టుకున్న రూ.3,500 నగదును వెనక గుంపులో వచ్చిన దొంగ కొట్టేశాడు. బస్సు ఎక్కి టికెట్ తీసుకునేందుకు జేబులో చూసుకోగా చోరీ జరిగినట్లు గ్రహించి బస్సు దిగి పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకొని బస్టాండ్‌లోని సీసీ కెమెరాల్లో నమోదైన రికార్డులను పరిశీలించాలని ఆర్టీసీ అధికారులను కోరగా పనిచేయడం లేదని చెప్పారు. దీంతో ఆ పరిసరాలను పరిశీలించి వెళ్లారు.

వేలంలో రూ.64 వేల ఆదాయం

కృష్ణగిరి: మండల కేంద్రం సమీపంలోని హంద్రీ – నీవా రిజర్వాయర్‌లో చేపల పెంపకం హక్కుల వేలం ద్వారా రూ.64 వేల ఆదాయం సమకూరినట్లు గాజులదిన్నె ప్రాజెక్టు మత్స్యశాఖ అధికారి చంద్రయ్య తెలిపారు. కృష్ణగిరిలోని సచివాలయంలో బుధవారం జరిగిన వేలం పాటలో తుగ్గలి మండలం ఆర్ఎస్ పెండేకల్లు గ్రామానికి చెందిన చాందుబాషా వేలం పాట దక్కించుకున్నట్లు వెల్లడించారు. ఈ ఏడాది జూన్ చివరి నాటికి ఈ వేలం పాట గడువు ముగుస్తుందని ఆయన తెలిపారు. పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండ టౌన్: పత్తికొండ ప్రాంత ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న టమాట జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు త్వరత్వరగా అడుగులు పడుతున్నాయి. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి చొరవతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే వర్చువల్‌గా గత నెలలో భూమి పూజ చేయగా బుధవారం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, అగ్రికల్చర్ ప్రాజెక్ట్ జోనల్ ఆఫీసర్ సుభాష్, ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉమాదేవి తదితరులు పత్తికొండ–ఓసూరు రోడ్డులో ఈర్లగుట్ట ప్రాంతంలో ఫ్యాక్టరీ ఏర్పాటు చేసే స్థలాన్ని పరిశీలించారు. సుమారు రూ.10 కోట్ల వ్యయంతో ఫ్యాక్టరీ ఏర్పాటు చేసేందుకు సీఎం సానుకూలంగా స్పందించడంతో పనులు ప్రారంభించేందుకు సిద్ధం చేస్తున్నామన్నారు. ఫ్యాక్టరీ ఏర్పాటుకు 3 ఎకరాల విస్తీర్ణం అవసరంకాగా ప్రాథమికంగా 1.6 ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణాలకు అనుగుణంగా భూమిని చదును చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. త్వరలో ఫ్యాక్టరీ నిర్మాణ పనులు ప్రారంభించాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు.

అవి-ఇవి

మద్యం విక్రేత అరెస్టు

కృష్ణగిరి: మండల పరిధిలోని లాల్‌మాన్‌పల్లె గ్రామ శివారులో ఈద్గా వద్ద కర్ణాటక మద్యం కలిగి ఉన్న ఉప్పరి మనోహర్‌ను బుధవారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఇతని నుంచి 28 ఒరిజినల్‌చాయిస్ విస్కీ టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మండలంలో ఎక్కడైన అక్రమంగా మద్యం అమ్మితే తమకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలి

నందవరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆశయాలకు అనుగుణంగా ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలని ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరేష్‌గౌడ్ కోరారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రకు ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్ర మంత్రి సత్యపాల్ సింగ్ బఘేల్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఫీల్డ్ అసిస్టెంట్లలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలన్నారు. శ్రమకు తగ్గ వేతనం నెలకు రూ.26 వేలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మండలంలోని ఫీల్డ్ అసిస్టెంట్లు అర్జున్, శివ, ఈరన్నగౌడ్, వీరేష్ పాల్గొన్నారు.

బీమా తక్షణసాయం అందజేత

తుగ్గలి: మండల పరిధిలోని లంకాయపల్లికి చెందిన చాకలి రంగనాయకులు (35) నాలుగు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన పేరిట వైఎస్సార్ బీమా పథకం తక్షణ సాయంగా మంజూరైన రూ.10 వేలను వెల్ఫేర్ అసిస్టెంట్ విజయకుమార్ బుధవారం మృతుని భార్య చంద్రమ్మకు అందజేశారు. మిగతా సొమ్ము త్వరలో నామినీ బ్యాంక్ ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తుందన్నారు.

పోలీసులకు సమాచారం ఇవ్వండి

వెల్దుర్తి(కృష్ణగిరి): సంక్రాంతి పండుగ, ఇతరత్రా సందర్భంగా ఇళ్లకు తాళాలు వేసి ఊర్లకు వెళ్లే వారు స్థానిక పోలీసులకు సమాచారం అందించాల్సిందిగా ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఊర్లకు వెళ్లే వారు నగదు, ఆభరణాలను బ్యాంకులో ఉంచి వెళ్లాలని, బైక్, కారు పార్కింగ్, లాకింగ్ సేఫ్టీ పాటించి వెళ్లాలన్నారు. తమ గస్తీ కొనసాగుతూ ఉంటుందని, తాళాలు వేసి వెళ్లిన ఇళ్లు, దుకాణాల ప్రాంతాల్లో మరింత గస్తీ పెంచుతామన్నారు.

పకడ్బందీగా ఓటరు జాబితా ప్రక్షాళన

- దరఖాస్తుల స్వీకరణకు రేపు తుదిగడువు
- ఈ నెల 22న తుది జాబితా విడుదల
- మార్పులు, చేర్పులతో పాటు తొలగింపు అర్జీల సంఖ్య 54,740
- నియోజకవర్గంలో 2,49,523 మంది ఓటర్లు



ఆలూరులో ఓటరు దరఖాస్తులను పరిశీలిస్తున్న ఏఈఆర్వో రామాంజనేయులు

ఆలూరు రూరల్: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ఓటర్ల జాబితా సవరణపై ఆలూరు నియోజకవర్గ యంత్రాంగం దృష్టి సారించింది. ఈ నెల 22న తుది మూసాయిదా ఓటరు జాబితా ప్రకటించనున్నారు. గతేడాది జూలై నుంచి ఇప్పటివరకు బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు నమోదు చేయించారు. అలాగే జనవరి 1వ తేదీ నాటికి పద్దెనిదేళ్లు నిండే వారందరికీ ఓటు హక్కు కల్పించారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో నమోదైన ఓటు శాతం పరిగణలో తీసుకుని ఓటింగ్ శాతం పెరగడానికి, తగ్గడానికి గల కారణాలు ఈ సర్వేలో గుర్తించారు. నియోజకవర్గం వ్యాప్తంగా ఓటర్ల జాబితా సవరణపై బీఎల్‌ఓలకు మండల కేంద్రాల్లో శిక్షణ తరగతులు నిర్వహించి దిశానిర్దేశం చేసి ఓటర్ల జాబితా సవరణ పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. ఆలూరు నియోజకవర్గ ఎన్నికల అధికారి మల్లికార్జున పర్యవేక్షణలో ఆయా మండల తహసీల్దార్లు, సహాయ ఎన్నికల అధికారుల సహకారంతో జాబితా సవరణపై ఎన్నికల సంఘం గుర్తించిన రాజకీయ పార్టీల నాయకులకు సైతం అవగాహన కల్పించారు. బీఎల్‌ఓలకు ఇచ్చిన ప్రత్యేక యాప్‌లో సవరణ వివరాలు నమోదు చేయించారు. తాజా లెక్కల ప్రకారం ఆలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఉన్న 294 పోలింగ్ కేంద్రాల్లో 04.07.2023 నాటికి 2,49,233 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

22న ముసాయిదా ఓటరు జాబితా

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అధికారులు ఓటరు జాబితా ప్రక్షాళన చేశారు. మార్పులు, చేర్పులు, మరణించిన వారు, గ్రామం వదిలి వెళ్లిన వారి ఓట్ల తొలగింపునకు శుక్రవారం తుది గడువని అధికారులు తెలియజేశారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో బుధవారం వరకు ఫారం–6 (కొత్త ఓటర్ల చేర్పు)కు 20,773 దరఖాస్తులు రాగా, 20,338 దరఖాస్తులను ఆమోదించారు. ఫారం–7 (తొలగింపు) 15,305 గుర్తించి ఇందులో 15,123 మందిని తొలగించారు. ఫారం–8 (మార్పులు) 12,589 దరఖాస్తులకు గాను 12,446 మంది ఓటర్ల వివరాల మార్పులు చేశారు. నియోజకవర్గంలో మొత్తం 54,740 దరఖాస్తులు స్వీకరించి 47,957 దరఖాస్తులకు పరిష్కరించారు. ఇందులో ఇంకా 720 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయి.

పారదర్శకంగా జాబితా సవరణ



ఎన్నికల కమిషన్, జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా సవరణ పారదర్శకంగా నిర్వహించాం. బూత్ లెవల్ ఆఫీసర్లు ఇంటింటికీ వెళ్లి తప్పొప్పులను సరిచేశారు. 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులందరికీ ఓటు హక్కు కల్పించాం. రేపు ఓటరు జాబితా సవరణ అర్జీల స్వీకరణకు తుది గడువు. దరఖాస్తులను క్షేత్రస్థాయిలో ఆయా మండలాల తహసీల్దార్లు పర్యవేక్షిస్తారు. ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా జాబితా సవరణ చేసి ఈ నెల 22వ తేదీన ముసాయిదా జాబితా ప్రకటిస్తాం.

– మల్లికార్జున, ఈఆర్వో, ఆలూరు

12న సామాజిక తనిఖీ ప్రజావేదిక

తుగ్గలి: స్థానిక స్త్రీ శక్తి భవనం వద్ద ఈ నెల 12న సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సావిత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారం రోజులుగా సామాజిక తనిఖీ బృందాలు ఉపాధి పనులు తనిఖీ చేసి గుర్తించిన అంశాలను సభలో వినిపిస్తారన్నారు.

వేలంపాట వాయిదా

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో శ్రీరంగనాథస్వామి దేవాలయంలో తలనీలాల వేలంపాట మరోసారి వాయిదా పడినట్లు బుధ వారం ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ దస్తగిరిగౌడ్ తెలిపారు. ఈ నెల 17వ తేదీ వేలంపాట నిర్వహించడం జరుగుతుందన్నారు. గతంలో రెండుసార్లు వేలంపాట నిర్వహించతలపెట్టినా సరైన స్పందన రాకపోవడంతో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు వాయిదా వేశామన్నారు. దేవదాయ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు గ్రామస్తులు పాల్గొన్నారు.

VEHICLES FOR SALE

S.No.	VEHICLE NO.	VEHICLE DISCRIPTION	MODEL
1	AP31CW-9001	XUV 500 W8 FWD DIESEL 7 SEATER	2015
2	AP27TU-2669	EICHER 11.10XP FBT	2012
3	AP39TL-3040	AL DOST	2020

వేలము వేయు ప్రదేశము: శ్రీరామ్ ఆటోమాల్,
పంచలింగాల, NH-7, అలంపూర్ టోల్‌గేట్ దగ్గర, కర్నూలు.
సెల్: 98499 81334

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో
మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆలూరు
70750 09147 (ఎమ్మిగనూరు),
97054 44304 (ఆలూరు, పత్తికొండ)
Office mail : sakshiknladvt@gmail.com